కథ

# అప్పుడూ ఇప్పుడూ ఓ జానకి!

**పెయ్యేటి రంగారావు**

## పితృకాండ

ఆనందరావు తనకి జానకి పుత్రికగా లభించాలని జనకమహారాజులా ఏ క్రతువులూ, యాగాలూ చెయ్యలేదు! అతడికి ఆ అవసరమూ లేదు. అతడికి పండంటి పుత్రరత్నం సాయి ఎటూ ఉన్నాడు. అతడిని పున్నామ నరకం నుంచి తప్పించడానికి ఆ వంశోద్ధారకుడు చాలు.

ఇప్పుడు...ఆడపిల్ల పుట్టినందుకు అతడు పాపం చాలా కుమిలిపోతున్నాడు. ముందే భ్రూణహత్య చేయలేని తన అసమర్థతని తిట్టుకుంటున్నాడు. చూస్తూ చూస్తూ ఉండగానే ఆరేళ్లు గడిచిపోయాయి.

ఒకనాటి సాయంత్రం ఆనందరావు ఆఫీసు నుండి ఇంటికి వచ్చేసరికి కనిపించిన దృశ్యం అతడిని నిర్ఘాంతపోయేలా చేసింది. పక్కింటి రేడియోలోంచి తిల్లానా వినిపిస్తోంది. దానికి అనువుగా జానకి లేడిపిల్లలా చెంగు చెంగున గెంతుతూ నర్తిస్తోంది.

అతడి దృష్టిలో అణిగిమణిగి ఉండాల్సిన ఆడది విచ్చలవిడిగా గెంతుతూంటే వెర్రి ఆవేశం వచ్చి చేతిలోని కాలుతున్న సిగరెట్టుని ఆమె వీపుమీద ఆనించాడు. ఆ పసిగుడ్డు గుక్కపట్టి ఏడుస్తూంటే ఆనందరావు రౌద్రంగా అరిచాడు.

''పాపిష్టిదానా! మన ఇంటా వంటా లేదు ఆడది బరితెగించి తైతక్కలాడడం. ఆడదానివై పుట్టాక ఎంత అణకువగా ఉండాలి? ఇప్పుడైతే సిగరెట్టుతో చురక వేశాను. నీ కళ్లు ఎప్పుడూ కాలి బొటనవేలినే చూసుకుంటూ ఉండాలి. తెలిసిందా?'' అంటూ మరొక్కసారి చెంప చెళ్లుమనిపించాడు.

ఏ ఏడు సముద్రాలలోను ఉప్పెన రాలేదు. సూర్యచంద్రాదులు గతులు తప్పలేదు. ఆఖరికి గాలి స్తంభించను కూడా లేదు.

కానీ ముళ్లచెట్టున ఉద్భవించిన ఒక లేత మొగ్గ పరిణామక్రమానికి అతీతంగా, వికసించడం మాని, విరితావులు చిందించడానికి వణికిపోయి ఒక జీవితకాలం పాటు మొగ్గగానే మిగిలిపోయింది.

మర్నాటి సాయంత్రం పక్కింటి కమల పరిగెత్తుకుంటూ వచ్చింది.

''ఏమే జానీ, దాగుడు మూతలు ఆడుకుందాం వస్తావా?''

జానకి ఎగిరి గంతేసింది.

''ఎవరెవరు?''


''నువ్వు, నేను, చిట్టి, బుజ్జి, సుబ్బులు, కిష్టిగాడు, ప్రసాదు...''

జానకి కంగారుగా అంది ''వద్దు వద్దు, నేను రాను''

''అదేమిటే, ముందు రావడానికి సిద్ధపడ్డావుగా?''

''అవును. కానీ మగపిల్లలతో ఆడితే మా నాన్నగారు చంపేస్తారు''

''ఏం చంపరులే రా'' అంటూ వీపు మీద చరిచేసరికి సిగరెట్టు కాలిన పుండు రేగి జానకి కెవ్వున అరిచింది.



ఒకసారి వేసవి సెలవులకి జానకి పెద్దమ్మ కొడుకు పండు వాళ్లింటికి వచ్చాడు. అతడు జానకి కన్నా రెండేళ్లు పెద్దవాడు. జానకి అంత ముభావంగా ఉండడం, తల వంచుకుని తిరగడం చూస్తుంటే పండుకి ఆశ్చర్యంగా ఉంది. తనతో మాట్లాడదు. ఇదివరకు 'పండన్నయ్యా' అంటూ చనువుగా తిరిగేది. ఇప్పుడు శత్రువుని చూసినట్లు చూస్తోంది.

ఒకసారి జానకి ఒళ్లో మల్లెలు పోసుకుని పూలమాల గుచ్చుతోంది. పండు వెనకాలే వెళ్లి జానకి కళ్లు మూశాడు. ఆమె ఉలిక్కిపడి విడిపించుకుంది.

పండు నవ్వుతూ ''నేనే చెల్లాయి, నీ పండన్నయ్యని'' అన్నాడు, భుజం మీద చెయ్యి వేసి.

జానకి కెవ్వున అరిచి విరుచుకుని పడిపోయింది. పండు నిర్ఘాంతపోయాడు. ఇంక ఆ తర్వాత అతడక్కడున్న వారం రోజులలోను ఒక్కసారి కూడా జానకితో మాట్లాడడానికి సాహసించలేదు.

ఆనందరావు ఇంటికి ఎవరొచ్చినా జానకి అణకువ, వినయ విధేయ


తలు, సత్ప్రవర్తన చూసి చాలా మెచ్చుకునేవారు. మగవారు మెచ్చుకోవడం సరేసరి. ఆడవారు కూడా జానకిని చూసి బుగ్గలు పుణికి ముద్దాడుతూ ఇలా అనేవారు.

''ఈ కాలంలో పుట్టాల్సిన పిల్ల కాదమ్మా. ఎంత ఒద్దిక! వంచిన తలెత్తదు. ఇంటెడు చాకిరీ చురుగ్గా చేసుకుంటూ పోతుంది. చిన్న వయసయినా ఎవరినీ కన్నెత్తి చూడదు. తన మాట తనకే వినబడనంత నెమ్మదిగా మాట్లాడుతుంది''

జానకి బుద్ధిమంతతనం, మంచి నడవడి గురించి ఆ ఊళ్లో అందరూ చాలా అబ్బురంగా చెప్పుకునేవారు. వాళ్ల పొగడ్తలు వింటూంటే ఆనందరావు ఛాతీ గర్వంగా పొంగిపోయేది.

'తను ఎంతో కట్టడిలో ఉంచి పెంచుతుండబట్టేగా జానకి ఇలా ఉంది' అని సంబరపడిపోయేవాడు.

అలా ఆనందరావు కట్టడిలో ఎంతో కట్టుబాట్లతో పెరిగిన జానకి పెద్దదయింది. పెద్దదయింది అంటే పదకొండేళ్ల వయసొచ్చింది అన్నమాట!



అప్పుడు ఆనందరావు అనుకున్నాడు.

'ఆడపిల్లకి ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలి. అలా జరక్కపోతే పలుపుతాడు తెంచుకున్న పశువులాగ కట్టు తప్పి.. గట్టు దాటి వంశానికి మాయని మచ్చ తీసుకురాదూ? ఇక ఆ మూడు ముళ్లూ వేయించకపోతే తర్వాత పర్యవసానాలు ఎలా ఉంటాయో ఎవరు చెప్పగలరు? అసలు ఎనిమిదేళ్లకే దాని పెళ్లి జరగాలి. ఇప్పటికే చాలా ఆలస్యం అయింది'

ఆనందరావు పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. పేరయ్యలని, పెద్దమనుషులని వాకబు చేయగా చేయగా- ఒక మంచి సంబంధం దొరికింది.

'కుర్రాడు కాలేజీలో చదువుతున్నాడు. చాలా బుద్ధిమంతుడు. ఎప్పుడూ ఫస్టుమార్కులే. పైగా డిగ్రీ అవ్వగానే అదృష్టం బాగుండి- అదృష్టం బాగుండే తీరుతుంది. పై చదువులకి లండను వెళ్లి వస్తాడట! ఆ పైన ఇండియా రాగానే అంతా కనకవర్షమే కదా! అంతా పిల్లదాని అదృష్టం! ఈ సంబంధం ఏమైనా ఖాయం చేయాలి' అని నిశ్చయించుకున్నాడు ఆనందరావు.

నిశ్చయించుకున్నదే తడవుగా ఒక మంచి రోజు చూసి పిల్లని చూడడానికి రమ్మని ఆహ్వానించి వచ్చాడు.

ఆ కుర్రవాడి పేరు సీతారామారావు. పేర్లు కూడా చక్కగా జతపడ్డాయి అని అందరూ సంతోషపడ్డారు.

పెళ్లిచూపుల తతంగం మొదలయింది. జానకిని తీసుకువచ్చి చాప మీద కూర్చోపెట్టారు. ఎవరో ''అమ్మాయికి సంగీతం వచ్చా?'' అని అడిగారు.

ఆనందరావు నవ్వుతూ అన్నాడు. ''మా అమ్మాయిని చెప్పడం కాదు గానండి, సంగీతం పుట్టుకతో అబ్బిన విద్య. కోకిలలాగే మా అమ్మాయి కూడా ఎవరి దగ్గరా నేర్చుకోకపోయినా మనోహరంగా పాడగలదు.''

మరొకరు అన్నారు. ''అయితే మీ కోకిలని ఒక్క పాట పాడమనండి''

జానకి నొసట చిరుచెమటలు కమ్ముకున్నాయి. ఆమె గుండెలు వడిగా కొట్టుకుంటున్నాయి. ఆమె తన కాలి బొటనవేలిని చూసుకుంటోంది.

మగపెళ్లివారి తాలూకు పెద్ద ముత్తయిదువు ఎవరో అంటోంది. ''అమ్మాయి అలా సిగ్గుపడితే ఎలాగమ్మా? అబ్బాయి, అమ్మాయి ఒకర్నొకరు చూసుకుని ఇష్టపడద్దూ? ఒక్కసారి తలెత్తి అబ్బాయిని చూడమ్మా''

జానకి చెవుల్లో హోరు. ''పాపిష్టిదానా, ఎప్పుడైనా పేంటు, చొక్కా కేసి కన్నెత్తి చూశావో, అట్ల కాడ కాల్చి వాతలెడతా''

జానకి నిలువెల్లా వణికిపోయింది.

ఆనందరావు గర్వంగా చెబుతున్నాడు. ''మా అమ్మాయిని చెప్పుకోవడం కాదు గానండి, ఈ కాలంలో పుట్టవలసిన పిల్లకాదు. ఇంట్లో కూడా ఎప్పుడూ వంచిన తలెత్తదు. పెద్దలంటే విపరీతమైన భక్తి, భయం, అణకువ.''

అందరికీ పిల్ల చాలా నచ్చింది ఒక్క సీతారామారావుకి తప్ప. 'ఒక్కసారైనా ఆ సోగకనులెత్తి వాలు చూపుల గాలాన్ని ఓరగా విసిరి తన గుండెను బంధించకూడదూ? పిల్ల మాత్రం అబ్బ, మనోహరంగా ఉంది!' అనుకున్నాడు.

### పితృకాండ సమాప్తం!

## పతికాండ

జానకికి చాలా గర్వంగా ఉంది. ఎన్నో మంచి సంబంధాలొస్తే వాటన్నిటినీ కాదని, ఏరికోరి తనని చేసుకున్నాడు.

సీతారామారావుకి చదువు పూర్తయింది. ఆ కాస్త అడ్డూ తొలగించుకుని పిల్లని కాపురానికి తీసుకెళ్తామన్నారు అత్తవారు.

ఆ రోజు రాత్రి గదిలోకి రాగానే సీతారామారావు ప్రేమగా దగ్గరకి తీసుకోబోయాడు.

ఆమె నిలువెల్లా వణకిపోయింది. సిగ్గు వల్ల అది సహజమే కదా అని సర్దిచెప్పుకున్నాడు. ఆమె చాప పరుచుకుని దాని మీద పద్మాసనం వేసుక్కూర్చుని స్తోత్రాలన్నీ చదువుకోసాగింది.

## వినూత్నచిత్రం

**చూడగానే ఆకట్టుకుని చక్కిలిగింతలు పెట్టే ఛార్మి ఇపుడు ఓ ప్రధానపాత్రలో కన్పించి కవ్వించనుంది. 'ఐతే' చిత్రాన్ని రూపొందించిన గంగరాజు నిర్మిస్తున్న 'అనుకోకుండా ఓ రోజు' చిత్రంలో హీరోయిన్‌గా ఛార్మికి అవకాశం ఇచ్చారు. 'ఈ చిత్రం నాకు మంచి బ్రేకనిస్తుంది. ఐతే తరహాలో ఈ సినిమా కథ కూడా డిఫరెంట్‌గా ఉంటుందంటున్నారు. ఆ సినిమాలాగే ఈ సినిమా మంచి హిట్ అయితే ఛార్మి దశ తిరిగినట్టేనేమో!**

అతడు ఒక గంట ఓపికగా నిరీక్షించాడు. అప్పటికామె ధ్యానం పూర్తయింది. తలలోని మల్లెలమాలని జాగ్రత్తగా తీసి గ్లాసుడు నీళ్లలో వేసింది.

''మళ్లీ ఇదేమిటి?'' అడిగాడు సీతారామారావు.

''అలా ఉంచితే తెల్లారినా వాడిపోవు'' అంది జానకి.

సీతారాముడికి ఒళ్లు మండింది.

''అసలా మల్లెలు తల్లో పెట్టుకునేది వాడిపోడానికే'' అన్నాడు.

## వెరైటీగా నటిస్తా

**ఎప్పుడూ గ్లామర్, పెర్ఫార్మెన్స్, ఇమేజ్ అని చూడకుండా తమకు లభించిన పాత్రల్ని చక్కగా పోషించి జనాన్ని మెప్పించాలంటోంది నమిత. సొంతం, ఓ రాధ ఇద్దరు కృష్ణుల పెళ్లి, జెమిని చిత్రాల్లో నటించిన నమిత వెరైటీగా ఉండే పాత్రలంటే తనకెంతో ఇష్టం అంటోంది. కోడిరామకృష్ణ దర్శకత్వంలో రాజశేఖర్ సరసన నటిస్తున్న నమిత మంచి పాత్రల కోసం అన్వేషిస్తోంది. మంచి బ్రేక్ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తోంది. అన్నట్టు ఇప్పుడు నమిత కొంచెం లావయినా అందంగానే ఉందంటున్నారంతా.**

''వాడిపోకపోతే రేపు కూడా తల్లో పెట్టుకోవచ్చు కదా?'' అంది జానకి.

''సరే దా, పడుకుందాం'' అన్నాడు.

ఆమె బెదిరిపోతూ ''ఈ చాప మీద బాగానే ఉంది. ఇక్కడే పడుకుంటాను'' అంది.

సీతారాముడు తొందరపాటు మనిషి కాదు. స్వచ్ఛమైన గంగాజలం లాంటి పిల్ల తనకి భార్యగా దొరికింది. కావల్సిన పాత్రలో పోస్తే తనకిష్టమైన పద్ధతిలో మూస దిద్దుకోవచ్చు అని సంబరపడ్డాడు.

ఆ రోజు నుంచి జానకికి మనోవిజ్ఞానంలో పాఠాలు మొదలయ్యాయి. స్త్రీ పురుషుల మధ్య సంబంధాలు ఎలా ఉండాలి, భర్త మాటకి జవదాటకుండా భార్య ఎలా నడుచుకోవాలి, ఉత్తమ ఇల్లాలి కుండవలసిన లక్షణాలేమిటి, ఆధునిక సమాజంలో స్త్రీ పాత్ర ఏమిటి వగైరా అన్ని విషయాల గురించి సీతారామారావు ఓపికగా జానకికి బోధించుకుంటూ వచ్చాడు.

ఒకరోజు ఆదివారం సీతారామారావు మిత్రులు వచ్చారు. అందరూ పేకాటలో పడ్డారు. మధ్యలో సీతారామారావు వంటింట్లోకి వచ్చి అందరికీ పకోడీలు, కాఫీలు ఏర్పాటు చేయమని పతివ్రతా శిరోమణికి ఆజ్ఞ జారీ చేసి వెళ్లాడు.

జానకి ఆదరాబాదరగా పకోడీలు చేసి చక్కగా ప్లేట్లలో సర్దింది. కానీ సీతారామ్ లోపలికి రాలేదు. ఆమెకి ఏం చేయాలో తెలియక అలాగే ఉండిపోయింది. గంట తర్వాత రౌద్రాకారంతో సీతారామ్ లోపలికి వచ్చాడు. ప్లేట్లలో పకోడీలు చల్లారిపోయి ఉన్నాయి. సీతారామ్‌ని చూడగానే జానకి ఏడ్చేసింది. అతడికి జాలి వేసింది.

''చూడు జానకీ, ఇంతవరకూ నువ్వు గడిపిన జీవితం అది జీవితం కాదు. మీ నాన్న పెంపకం అలా ఏడిసింది. కనక నీవు బయటి ప్రపంచం అంటే తెలీకుండా ఇంతవరకూ బ్రతికేశావు. రా సంతోషంగా నా చేతి ఆసరా తీసుకో. ఇంట్లో నీ కనుసైగలకి నర్తించే దాసదాసీ జనాలున్నారు. బయట నీ అందానికి అబ్బురపడుతూ నీకు దాసోహమనే నారీమణులున్నారు. నాగరికత నేర్చుకో పూర్తిగా! ఇంతవరకూ నువ్వు వంచిన తల ఎత్తలేదు. ఇకనించీ ఎత్తిన తల దించకు!'' అన్నాడు.

రోజులు గడుస్తున్నాయి.

''ఇప్పుడు ఝాన్సీలక్ష్మీబాయి జన్మదినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీమతి జానకి



సీతారామ్‌గారిని తమ అమూల్యమైన సందేశాన్ని వినిపించవలసిందిగా ప్రార్థిస్తున్నాం''

జానకి సీతారామ్‌గారు హుందాగా కుర్చీలోంచి లేచారు. వందలకొద్దీ కెమేరాలు తళుక్కుమన్నాయి. వీడియోగ్రాఫర్లు హడావుడిగా ఆవిడ ప్రతి కదలికనీ దృశ్యీకరిస్తున్నారు. ప్రేక్షకులు లయబద్ధంగా కరతాళ ధ్వనులు చేస్తూంటే ఆవిడ వేదిక మీదికి నడిచి వెళ్లారు.

''శతాబ్దాలనించీ స్త్రీజనోద్ధరణ అంటూ తుమ్మెదలు ఝుంకారం చేస్తూనే ఉన్నాయి. కానీ జరుగుతున్నది మాత్రం జనోద్ధరణే. అబల, కుసుమకోమలి, సోయగాల కుప్ప, సొగసుల మాలిక లాంటి పదాల్ని వాడి, మగవాడి అనుభవం కోసమే ఆడదాని బ్రతుకు అన్న నానుడిని ఏర్పరిచారు. ఎక్కడ చూసినా వయసుతో నిమిత్తం లేకుండా 'ఆడది' అన్న పదార్థం చెదపురుగుల పాలవుతూనే ఉంది. ఈ పరిస్థితులు మారాలంటే మారాలంటే మారాలంటే..''

హాలంతా ఊపిరి పీల్చడం కూడా మర్చిపోయి వింటున్నారు.

''ఈ ప్రపంచంలోంచి స్త్రీత్వాన్ని పూర్తిగా తొలగించివెయ్యాలి. ఏ భాషలోను, ఏ దేశంలోను అసలు సృష్టిలోనే స్త్రీలింగం అన్నది లేకుండా రూపుమాసిపోవాలి. అవునంటారా? మా సమస్యలకి పరిష్కారం ఇదేనని మీరూ అంటారా? కాకపోతే ఏదీ పరిష్కారం?''

శ్రోతలు తెల్లమొహాలేశారు.

జానకి సీతారామ్‌గారి స్వరంలో తీవ్రత చోటు చేసుకుంటోంది. హాలంతా ఆవిడ ప్రతి మాటకు ప్రతిస్పందించి చప్పట్లతో హోరెత్తిస్తోంది.

అలసిసొలసి కారు వెనక సీట్లో వాలిపోయిన జానకమ్మగారు పోర్టికోలో కారు ఆగగానే మత్తుగా కళ్లు తెరిచి, చిటికెలేస్తూ ఆవులించి తమ భవనం లోనికి అడుగెట్టింది.

ఆయా డైనింగు టేబులు దగ్గర కుర్చీ కోడుకి ఆనుకుని కునుకు తీస్తోంది. కింద కంచం విసిరివేయబడి ఉంది. అన్నమంతా చిందరవందరగా నేల మీద చిమ్మబడి ఉంది. ఒక మూలగా ముడుచుకుని ఆవిడ పుత్రరత్నం ఆరేళ్ల వయసున్న తేజ నిద్రపోతున్నాడు. అతడి బుగ్గల మీద కన్నీటి చారికల గుర్తులు! అతడి తలమీద ఆయా మొట్టికాయలు వేసినదానికి మాత్రం రుజువులు లేవు. అతడి చిన్నారి హృదయంపై బాధ్యతలేసి తల్లిదండ్రులు వేసిన సమ్మెటపోట్లకు కూడా సాక్ష్యాధారాలు లేవు.

కానీ తేజ తండ్రికి దూరమవుతున్నాడు. తల్లిని అసహ్యించుకుంటున్నాడు. తన పుట్టుకనే ఏవగించుకుంటున్నాడు.

తేజకి పన్నెండేళ్లు నిండాయి.

ఒకనాటి ఉదయాన పూజగదిలో కూర్చుని నిష్ఠగా ధ్యానం చేసుకుంటున్న తేజని చూసి జానకి,

సీతారామ్ ఇద్దరూ నిర్ఘాంతపోయారు.

సీతారామ్ తీవ్రంగా అడిగాడు. ''ఏమిట్రా ఇది?''

తేజ తాపీగా అన్నాడు ''సంధ్యావందనం చేసుకుంటున్నాను''

జానకమ్మ అడిగింది. ''అదేమిట్రా, సంధ్య వార్చాలంటే ఉపనయనం జరగాలి కదా?''

తేజ మరింత నిశ్చలంగా అన్నాడు ''జరిగింది!''

తల్లిదండ్రులిద్దరూ ఉలిక్కిపడి అడిగారు ''ఎప్పుడు?''

''అఖిల బ్రాహ్మణ సమాజాభివృద్ధి సంస్థ వారు సామూహిక ఉపనయనాలు జరిపిస్తోంటే, అనాథ బాలుణ్ణి అని చెప్పి ఉపనయనం చేయించుకున్నాను''

ఒక తరం మీద తరవాతి తరం తిరుగుబాటు చేయడం సహజమే. తల్లిదండ్రులిద్దరూ నిస్పృహాయంగా ఉండిపోయారు.

కానీ జానకికి మాత్రం తేజని చూసేసరికి విపరీతమైన భయం కలగసాగింది. వీడు కడుపులో పడ్డాకే తన తండ్రి పోయాడు.

కొంపదీసి ఆయనే మళ్లీ తనకి కొడుకుగా పుట్టలేదు కదా అనిపించేది. అయినా ఆ భయం క్షణం మాత్రమే. తేజ గురించి ఆలోచించేంత వ్యవధి, అతడి గురించి శ్రద్ధ తీసుకోవడానికి కావలసిన సావకాశం ఆవిడకిప్పుడు లేవు. అనుక్షణం అనేక సాంఘిక కలాపాల్లో పాల్గొంటూ సమాజంలో భర్త పలుకుబడి పెరగడానికి తోడ్పడడంతోనే సరిపోతోంది.

తేజది అదొక ప్రపంచం. స్నేహితులని ప్రోగు చేసుకుని హిందూమత పునరుద్ధరణకి పూనుకున్నాడు. ఎక్కడ హిందూ మత సంబంధమైన మహాసభలు జరిగినా అక్కడ ప్రత్యక్షమై స్వచ్ఛంద సేవలు అందిస్తోండే వాడు.

ఇలా రోజులు గడుస్తోండగా తేజకి ఇరవై నాలుగు సంవత్సరాలు వచ్చాయి. ఎం.బి.ఏ. డిగ్రీ కూడా చేతికి వచ్చింది. సీతారామారావుగారు తన పలుకుబడిని ఉపయోగించి తేజకి ఒక ప్రైవేటు కంపెనీలో అసిస్టెంటు జనరల్ మేనేజర్‌గా నెలకి ముప్పై వేల రూపాయల జీతం వచ్చే ఉద్యోగం ఇప్పించారు. కానీ తేజ ఆ ఉద్యోగం చేయడానికి ఇష్టపడలేదు. ఆ ఊళ్లోనే ఉన్న ఓ మఠంలో పీఠాధిపతిగారికి వ్యక్తిగత కార్యదర్శిగా ఉద్యోగం సంపాదించుకుని అందులో స్థిరపడిపోయాడు.

జానకమ్మగారు మహిళా లోకానికి చేస్తున్న సేవలకి గుర్తింపుగా ఆవిడకి ప్రభుత్వ పురస్కారం లభిస్తున్నట్లుగా వర్తమానం అందింది. సీతారామారావుగారు ఎంతో సంతోషించారు. జానకమ్మ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దింది తను. పురస్కారం తనకి అందుతున్నట్లే.

కానీ జానకమ్మ పురస్కారం అందుకుంటూండగా చూసే అదృష్టం సీతారామారావుగారికి లేదు. కారణం అదే సమయంలో లయన్స్ క్లబ్ వారి ఆహ్వానం మీద ఆయన అమెరికా వెళ్తున్నాడు. ఇద్దరూ యాంత్రిక జీవితాలకి అలవాటు పడిపోయారు కనుక 'గుడ్ లక్' అంటే 'గుడ్ లక్' అనుకుని ఒకరు అమెరికాకి, మరొకరు ఢిల్లీకి ప్రయాణమయ్యారు.

కానీ తిరిగి ఇంటికి మాత్రం జానకమ్మ ఒక్కర్తే వచ్చింది. సీతారామారావుకి బదులు ఆయన భౌతిక కాయం, విమానయాన సంస్థ వారు నష్టపరిహారంగా అందజేసిన అయిదు లక్షల రూపాయలకి చెక్కు. జానకమ్మ కొడుకు తేజ వెళ్లి రిసీవు చేసుకున్నాడు.

అలా జానకమ్మ జీవితం మరో మలుపు తిరిగింది.


**పతికాండ సమాప్తం.**

## పుత్రకాండ

తేజ ఆవేశంతో చిందులు వేస్తున్నాడు.

''భారతదేశమంటే చులకన, పాశ్చాత్య నాగరికత అంటే వ్యామోహం, ఆడదాన్ని గౌరవిస్తున్నట్లు పైకి పటాటోపం, కాని లోపల్లోపల ఆడదంటే బానిస, విలాస వస్తువు అన్న భావం.. ఏమిటి నాన్నగారి గొప్పతనం? బ్రతికినంత కాలం కృత్రిమంగానే బ్రతికారు. స్వదేశాన్ని అసహ్యించుకుంటూ, విదేశీ వెర్రిపోకడలని అనుకరిస్తూ జీబ్రాని చూసి వాతలెట్టుకున్న కంచరగాడిదలా! అందుకే పరాయిగడ్డ మీద పోయారు.

జానకమ్మ నిరుత్తరురాలయిపోయింది. తన పతిదేవుని మాటని తనెప్పుడూ జవదాటి ఎరుగదు. ఆయనని మనసులోనైనా విమర్శించే దుస్సాహసం తనెప్పుడూ చేయలేదు. కానీ వీడేమిటి? ఏ నోము నోస్తూ ఉద్యాపన చేయలేదో, ఏ వ్రతదీక్ష పూని మధ్యలో భంగపడ్డం జరిగిందో, ఈ సుపుత్రుడు ఇంటి పునాదులు కదిపేస్తున్నాడు.




జానకమ్మ మథనపడుతూ స్తబ్దుగా ఉండిపోయింది.

''అమ్మా, నా రొద వినిపిస్తోందా?''

జానకమ్మ ఉలిక్కిపడి 'ఆ' అంది.

తేజ కఠోరంగా అన్నాడు. ''ఆ, ఊ కాదు. ఇక నుంచీ నేను చెప్పిన పద్ధతిలోనే నువ్వు నడుచుకోవాలి. ఆ క్లబ్బులూ, విహారయాత్రలూ మాని కాస్త ఇంటి పరువు దక్కించు. బయటికెళ్లాలంటే సిగ్గుపడి చస్తున్నాను. పోనీ నా బ్రతుకు తెల్లారినా ఫరవాలేదు. కానీ వంశ మర్యాద తెల్లారితే అందరం కట్టకట్టుకుని గంగలో దూకాలి. నాకూ పిల్లలు పుట్టుకొస్తారు. నా ఖర్మ కాలితే ఆడపిల్లలే పుడతారు. వాళ్లకి పెళ్లిళ్లు కావాలా? అసలే రోజులెలా ఉన్నాయి?''

జానకమ్మ కళ్లనించి ధారగా కన్నీళ్లు కారుతుండగా అంది. ''నాయనా, నా జీవితంలో ఏనాడూ తండ్రి మాట జవదాటి ఎరుగను. నా భర్తని దైవంగా ఆరాధించుకుంటూ ఇన్నాళ్లూ బ్రతికాను''

తేజ విసుగ్గా అన్నాడు. ''వితండ వాదన వద్దమ్మా. నువ్వు ఆడదానివి. ఆడదానిలా ఉండు. బయట నలుగురూ నిన్ను చూసి భక్తితో తలలు వంచుకునే లాగు, ఇంట్లో అందరూ నిన్ను తలుచుకుని గర్వంగా తలలెత్తుకు తిరిగేలాగు నీ జీవితాన్ని మార్చుకో. ఇహలోకంలో అన్ని భోగాలూ అనుభవించావు. ఇంక పరం గురించి కూడా ఆలోచించాలి కదమ్మా?''

జానకి మౌనంగా తలూపింది.

రోజులు గడుస్తున్నాయి.

''నమస్కారం జానకమ్మగారూ, రామశర్మగారిని మీరెరుగుదురు కదా?'' జానకమ్మ ఇంట్లోకి ప్రవేశిస్తున్న మహిళామండలి సభ్యురాళ్లు అడిగారు.

భగవద్గీత చదువుకుంటున్న జానకి తల ఎత్తి అడిగింది. ''హైస్కూలు మాస్టారే కదూ?''

వాళ్లు కూర్చుంటూ అన్నారు. ''అవునండీ. వారమ్మాయిని కాలేజీకి వెళ్తున్నప్పుడూ, వస్తున్నప్పుడూ మన హోంమంత్రిగారి సుపుత్రుడు, మరికొందరు జులాయిలతో కలిసి అసభ్యంగా ఏడిపిస్తున్నాడట. ఎవరికి చెప్పుకున్నా ఫలితం లేకపోయేసరికి విరక్తి చెంది ఆత్మహత్య చేసుకోబోయిందట. ఇప్పుడా అమ్మాయి చావుబ్రతుకుల్లో ఆసుపత్రిలో ఉంది.''

జానకమ్మ కళ్లు ఆవేశంతో ఎర్రబడ్డాయి. భగవద్గీత మూసేస్తూ దిగ్గున లేచింది.

''ఆ పశువుల అంతు చూద్దాం పదండి.''

ఆవిడ గడప దాటబోతూండగా

అప్పుడే తేజ వంకరగా నవ్వుతూ లోపలికొస్తున్నాడు. అతడిని చూడగానే జానకమ్మ గాబరా పడింది.

తేజ ఆవిడకేసి, ఆవిడ వెనకాల వాళ్లకేసి చూస్తూ అడిగాడు. ''ఎక్కడికమ్మా బయలుదేరావు?''

ఆవిడేదో చెప్పబోతూండగానే పక్కనున్న వాళ్లు అందుకుని జరిగిందంతా పూసగుచ్చినట్లు చెప్పారు.

తేజ నొచ్చుకుంటున్నట్లుగా అన్నాడు. ''అయ్యో, మీరంతా నన్ను క్షమించాలి. మా అమ్మ గారి ఆరోగ్యం ఈ మధ్య అస్సలు బాగుండటం లేదు. దానికి తోడు ఇవాళ వైకుంఠ ఏకాదశి అని చెప్పి పొద్దుటి నుంచీ పచ్చి మంచినీళ్లు కూడా ముట్టుకోలేదు. మొన్న ఇలాగే ఉపవాసం ఉండి, బయటికెళ్లి కళ్లు తిరిగి పడిపోతే ఆవిడకేదన్నా జరగరానిది జరిగినా ఇంక తన బాధ్యతేమీ ఉండదని డాక్టరుగారు నన్ను చీవాట్లు వేశారు. మీరొచ్చిన పనా, గంభీరమైనదాయె. మీకేం చెప్పాలో నాకే అర్థం కావటంలేదు''

వాళ్లంతా చాలా బాధపడిపోతూ జానకమ్మగారితో అన్నారు. ''ఎంత పని చేశారమ్మా! ఈ విషయాలు మాకు ముందే చెప్పద్దూ? ఇవాళ్టికి మీరు ఇంట్లోనే ఉండండి. ముందు మేం వెళ్లి ఆ అమ్మాయి పరిస్థితి ఎలా ఉందో చూసొస్తాము. దాన్ని బట్టి తర్వాత ఏం చేయాలో ఆలోచిద్దాం.''

జానకమ్మ నీరసంగా అంది. ''సరే ముందు మీరెళ్లి రండి''

ఆ రోజే కాదు, ఆ తర్వాత జానకమ్మకి ఏ రోజూ, ఎప్పుడూ, ఏ సాంఘిక కార్యక్రమాలలోనూ పాల్గొనడానికి వీలు చిక్కలేదు. ఎప్పుడూ పూజలు, పునస్కారాలు, గుడుల చుట్టూ ప్రదక్షిణలు వీటితోనే ఆమె కాలం తీరిపోయి, ఒకనాటి శుభఘడియల్లో గుండె ఆగి మరణించింది.

తేజను ఆడ, మగ అసంఖ్యాకంగా ఎంతో మంది పరామర్శించడానికి వస్తున్నారు.

''మహా దొడ్డ ఇల్లాలమ్మా. మొగుడున్నంత వరకూ ఆయనకి మంత్రిగా, తల్లిగా, దాసిగా అన్ని రకాల సేవలూ చేసింది. ఆయన హరీ అనగానే తను కూడా ఆయనతో మానసికంగా సహగమనం చేసింది. నలుగురి మధ్యా తిరుగుతున్నా, సన్యాసినిలా వైరాగ్యంతో జీవించింది. ఇటువంటి మహానుభావురాలు గతంలో పుట్టలేదు. మరింక ఈ భూమిపై పుట్టబోదు.''

జానకమ్మ భౌతికకాయం చాప మీద పడి ఉంది. ఆ శరీరాన్ని వదిలి పైకి లేచిన ఆమె ఆత్మ మాత్రం ఆ పరిసరాల్లోనే పరిభ్రమిస్తోంది. తన కొడుకూ కోడళ్ల హృదయవిదారక రోదనలు, వచ్చిన వాళ్ల పరామర్శలు వింటూ వెర్రి ఆవేశాన్ని తెచ్చుకోసాగింది. పాంచ భౌతికమైన శరీరంలో ఉన్నప్పుడు ఆమెకేనాడూ ఆవేశం కలుగలేదు. జీవచ్ఛవంలా బ్రతికింది. కాని కట్టె వదిలిన ఆమె ఆత్మ ఇప్పుడు ఆవేశంతో ఊగిపోసాగింది.

'నేను దొడ్డ ఇల్లాల్నా? పరోపకార పరాయణురాలినా? పరమ పవిత్రురాలినా? ఆ మగమహారాజు అదే నా తండ్రి నేను పుట్టినప్పుడు తన ఇంట్లోకి మహాలక్ష్మి దయ చేసిందంటూ ఆనందంతో గంతు లేయలేదు సరికదా..ఈ గుండెల మీద కుంపటెక్కడ దాపురించిందిరా అని మగదేవుళ్లని తలుచుకుంటూ, కుళ్లికుళ్లి ఏడిచాడట. అక్కడికి బాగానే ఉంది. కానీ నాకంటూ ఒక వ్యక్తిత్వాన్ని ఏర్పరుచుకోనిచ్చాడా ఆ పితృదేవుడు? పాట పాడితే బజారు మనిషినవుతానట. నాట్యమాడితే వెలయాలినవుతానట. సృష్టిలోని ఏ జీవి అయినా సరే, అది మొగదయితే మాత్రం, దానికేసి కన్నెత్తి చూడకూడదట. అల్లా చూస్తే వంశప్రతిష్ఠ బుగ్గయి పోతుందట! అప్పుడే నేను చచ్చిపోయాను.

అయినా ఇంకా ఎక్కడన్నా కొన ఊపిరి మిగిలి ఉందేమోనన్న శంకతో మరొక మగమహారాజు నాకు మొగుడుగా దాపురించి నన్ను నానా చిత్రహింసలూ పెట్టి పైశాచికానందాన్ని పొందాడు. నా జీవితాన్ని ఇంకో దారిలోకి మళ్లించి, తన అభిరుచులకి అనుగుణంగా ఆడే బొమ్మగా నా చేత కుప్పిగంతులు వేయించాడు. అప్పుడు మరొక్కసారి నేను చచ్చాను. అయినా నాలో జీవం ఉందేమోనని మగాళ్లకి అనుమానమే. అందుకే నాకు కొడుకు రూపంలో మరొక రాక్షసుడు అవతరించి, ఇదుగో, ఇంతవరకూ ఈడ్చుకు వచ్చాడు. నా మొగుడు పూసిన రంగుని తుడిచేసి, నా వేషాన్ని మార్చేసి, నన్ను భ్రష్టు పట్టించి, మళ్లీ తనకిష్టమైన మరొక పాత్రలో నా చేత నటింపజేశాడు. అప్పుడు మూడవసారి, మళ్లీ నేను చచ్చాను. ఇంకా నాలో జీవం ఏం మిగిలి ఉందని ఇప్పుడు చచ్చిపోయానని మీరంతా అనుకుంటున్నారు?

అర్థమవుతోందా ఆడాళ్లూ, క్షమయా ధరిత్రీ అనీ, స్త్రీ అంటే శక్తిస్వరూపిణి అనీ, కీర్తి శిఖరాన్ని అధిరోహించే ప్రతి పురుషుడికి ఒక స్త్రీ ప్రేరణగా ఉంటుందనీ ఈ మగవాళ్లు కూసే కారుకూతల్ని నమ్మి, భంగపడి, మీ బతుకుల్ని యుగయుగాలుగా తగలబెట్టుకుంటున్నారే! ఎప్పటికైనా, ఏ ఒక్క ఆడ నలుసుకైనా జ్ఞానోదయం కలిగి ఈ వ్యవస్థ మీద తిరుగుబాటు చేస్తుందా?'

జానకమ్మ ఆత్మ మౌనంగా క్షోభిస్తూండగానే ఆమె శరీరానికి దహనసంస్కారాలు జరిగిపోయాయి. అప్పటికి తేజ భార్య గర్భవతి!

మగవాళ్లు తమ జీవితాలని సార్థకం చేసుకోడానికి చేసే యజ్ఞాలలో సమిధలుగా యథాప్రకారం ఆడవాళ్లు ఆహుతి అవుతుండగా మరికొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి.

**పుత్రకాండ సమాప్తం.**

# (భరత) భారతి వాక్యం

తేజ అప్పుడే ఆఫీసు నుంచి ఇంట్లోకి అడుగు పెడుతున్నాడు. అక్కడ కనిపించిన దృశ్యం అతడిని నిర్ఘాంతపోయేలా చేసింది. టేపురికార్డరు లోంచి ఏదో జావళీ వినిపిస్తోంది. తదనుగుణంగా చెంగు చెంగుమని నర్తిస్తున్న తన కన్నకూతురు జానకిని చూసి ఆవేశంతో ఊగిపోతూ ఎదరకు వెళ్లాడు తేజ.

''పాపిష్టిదానా! మన ఇంటా వంటా లేదు ఆడది బరితెగించి తైతక్కలాడటం! ఆడదానివై పుట్టాక ఎంత అణకువగా ఉండాలి? ఎప్పుడైనా పేంటు, చొక్కా కేసి కన్నెత్తి చూశావో, అట్లకాడ తెచ్చి వాతలెడతా. నీ కళ్లు ఎప్పుడూ కాలిబొటన వేలినే చూసుకుంటూ ఉండాలి. తెలిసిందా?'' అంటూ ఆమెని చితకబాదడానికి చేతులెత్తాడు తేజ.

అప్పుడు...

ఏడు సముద్రాలలోను ఉప్పెన వచ్చింది!

సూర్యచంద్రాదులు గతులు తప్పారు!

ఆఖరికి గాలి కూడా స్తంభించింది!

జానకి ఆడపులిలా గాండ్రించింది!

''ఓ మగమహారాజా! అక్కడే ఆగు! కన్న తండ్రిగా నీ స్థానాన్ని నీవు నిలుపుకోవాలన్నా, నా నుంచి భక్తి గౌరవాల్ని నువ్వు పొందాలన్నా నీ హద్దులలో నువ్వుండు. ఈ కాలచక్రం గతిని మార్చడానికి నేను పుట్టాను. ఇక నుంచి తూర్పున సూర్యుడుదయించడు! సూర్యావతి ప్రభవిస్తుంది!

పాలకడలిలో శేషతల్పం మీద శ్రీమన్నారాయణుడి పాదాలు లక్ష్మీదేవి వత్తుతున్నట్లుగా చిత్రించిన పటాలు పూజామందిరాలలో ఉండవు. అలాంటి పతివ్రతల సినిమాలు ప్రదర్శింప బడవు.

ఆడది, మగవాడు పరస్పరం ప్రేమని, గౌరవాన్ని, ఆదరాన్ని, అభిమానాన్ని ఇచ్చిపుచ్చుకునే పద్ధతిలోనే సాంఘిక శాస్త్రాలు, ధర్మశాస్త్రాలు, నీతి శాస్త్రాలు పునర్లిఖించబడతాయి.

అందుకోసం నేను సాగించబోయే పోరాటంలో నా తోటి ఆడవాళ్లే నాకు సాయపడకపోవచ్చు.

మగవారు నాకు పగవారై నన్ను నిందలపాలు చేయవచ్చు. చిత్రవిచిత్ర రీతులలో నన్ను హింసించవచ్చు.

అయినా సరే నేను ఒంటరిగానే పోరాటం సాగిస్తాను! విజయాన్ని సాధిస్తాను.''

ఆమె..ఒక స్త్రీ..ఆవేశంతో నినదిస్తోంది!

అతడు..ఒక పురుషుడు..భయాతిరేకంతో చేష్టలు దక్కి ప్రాన్పడి నిలుచుండిపోయాడు!

☆